సేంద్రియ ఎరువులతో వ్యవసాయం

ఇచ్చోడ, మార్చి 26 : రైతులు సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేయాలని శాస్త్రవేత్తలు రాంగోపాల్ వర్మ, గోవర్ధన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, అఖిల భారత సమగ్ర వ్యవసాయ పద్ధతుల పరిశోధన విభాగం రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రోన్లతో వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు వాడడం ద్వారా పర్యావరణం నాశనమవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ, సెగ్రిగేషన్‌షెడ్డు పరిశీలన

నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్ రెడ్డి

తాంసి, మార్చి 26 : అంబుగాం గ్రామంలో ఏర్పాటు చేసి సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీని మంగళవారం ఎంపీడీవో మోహన్ రెడ్డి పరిశీలించారు. నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్, వాటర్ అందజేత, విత్తనాలు నాటడంపై పలు సూచనలు చేశారు. మొక్కలు నాటే సమయానికి నర్సరీలో మొక్కలు ఏపుగా పెంచాలని సూచించారు. మొక్కలు ఎండిపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ యశ్వంత్, పంచాయతీ కార్యదర్శి మేఘరాజ్ ఉన్నారు.

ట్రాఫిక్ పోలీసుల విస్తృత తనిఖీలు

నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తున్న సీఐ ప్రణయ్‌కుమార్

ఎదులాపురం, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా నంబర్‌ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. వాహనాలకు ఈ చలానా జరిమానాలు విధించి నంబర్ ప్లేట్ అమర్చుకునేల అవగాహన కల్పించారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశామన్నారు. డ్రైవ్‌లో ఎస్ఐ ఖాజామొహిన్, ఇన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో హోలీ వేడుకలు

హోలీ ఆడుతున్న చిన్నారులు

బోథ్, మార్చి 26 : మండలంలోని కౌట(బీ) గ్రామంతో పాటు బోథ్‌లోని పలు పాఠశాలల్లో మంగళవారం హోలీ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు ఒకరినొకరు రంగులు చల్లుకున్నారు. విద్యార్థులు హోలీ నృత్యాలు చేశారు.

28న ఉచిత కంటి వైద్య శిబిరం

ఎదులాపురం, మార్చి 26 : రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, పడగంటి కిష్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌కు చెందిన శరత్ మాక్సి విజన్ కంటి దవాఖాన వైద్యులు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, పోలీస్ డిపార్ట్‌మెంట్(ఆరోగ్య భద్రత కార్డు కలిగిన వారు) సింగరేణి ఉద్యోగులు, జర్నలిస్టులకు నగదు రహిత శస్త్ర చికిత్సలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9133900098, 9133900054 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎదులాపురం, మార్చి 26 : ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జైనథ్ మండలం బెల్లూరి గ్రామానికి చెందిన అశోక్, బాపురావ్‌లు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం మహారాష్ట్రకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ తలకు తీవ్ర గాయాలు కాగా, బాపురావ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు 108లో రిమ్స్‌కు తరలించారు.

రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించాలి

తాంసి(తలమడుగు), మార్చి 26 : తలమడుగు మండలం భరంపూర్ గ్రామానికి చెందిన కాకర్ల ఆశన్న అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. ఈ కుటుంబానికి రైతు బీమాతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 194 జీవో ప్రకారంగా రూ.6లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నారాయణ రెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు కల్పించాలి

కుంటాల, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు అన్ని బూత్‌లను సమాయత్తం చేయాలని సెక్టోరియల్ ఆఫీసర్ మధు అన్నారు. మరో సెక్టోరియల్ ఆఫీసర్ సుధాకర్‌తో కలిసి మంగళవారం ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లోని బూత్‌లను పరిశీలించారు. రూట్ నంబర్ 10లో కల్లూరు నుంచి దౌనెల్లి, రూట్ నంబర్ 11 అర్లీ నుంచి గొల్లమాడ ఉండగా, పోలింగ్ బూత్‌లలో కనీస వసతులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఇక్కడ మరో సెక్టోరియల్ ఆఫీసర్ సుధాకర్, రూట్ ఆఫీసర్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సద్గురు పూలాజీబాబా సత్సంగ్

మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

జైనథ్(బేల), మార్చి 26: బేల మండలం అవాల్‌పూర్ గ్రామంలో శ్రీ పరమహంస సద్గురు పూలాజీబాబా 3వ సత్సంగ్ వార్షిక మహోత్సవ కార్యక్రమం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా సత్సంగ్ చివరి రోజు మంగళవారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు

లాభాల నువ్వుల పంట

- భీంపూర్ మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం



అంతర్గాంలో సాగుచేస్తున్న నువ్వుల పంట

భీంపూర్, మార్చి 26 : నువ్వుల పంట విస్తీర్ణం క్రమంగా పెరుగుతున్నది. రైతన్న ఇంట సిరులు కురిపిస్తున్నది. భీంపూర్ మండలంలో ఈ యాసంగిలో జొన్న , నువ్వుల పంటలపై రైతులు ఆసక్తి చూపించినట్లుగా కనిపిస్తున్నది. కరంజి(టీ), గోముత్రి, అంతర్గాం, గుబిడి, వడూర్ గ్రామాల్లో, పెన్‌గంగ ఆవతలి మహారాష్ట్రలో కూడా ఈ సారి నువ్వుల పంట సాగు ఎక్కువగా ఉన్నది. నూనె గింజలకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నది. ఎకరాకు రూ.4- 5 వేల లోపే పెట్టుబడి అవుతుండగా పంటను నమ్ముకున్న రైతులకు లాభాలు తెచ్చిపెడుతున్నది. ఎకరాకు దాదాపుగా 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.10 -15వేల లోపు ఉన్నది. గత ఏడాది నువ్వుల పంట ధర క్వింటాల్‌కు రూ.18 వేల వరకు పలికింది. ఈ యాసంగిలో భీంపూర్ మండలంలో దాదాపుగా 1500 ఎకరాలు నువ్వుల సాగు అవుతున్నది. గత సంవత్సరం సాగు విస్తీర్ణం 600 ఎకరాలుగా ఉన్నది.

ఆరుతడి పంటల్లో మంచి పంట ..

ఆరుతడి పంటల్లో నువ్వుల పంట ఉత్తమమైనదని రైతులు భావిస్తారు. వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడి వస్తుంది. నువ్వుల సాగుకు ఎకరాకు 2 కిలోల విత్తనం అవసరం. విత్తిన నుంచి మొలకెత్తే దశ పంట వచ్చే వరకు ఎకరాకు రూ.5 వేల వరకు పెట్టుబడి అవుతుంది.

యాజయాన్య పద్ధతులు పాటించాలి

విత్తనం వేసిన నుంచి 90 రోజుల్లో ఈ పంట చేతికి వస్తుంది. విత్తిన పది రోజుల తర్వాత నీటి తడులు అవసరం. అలాగే వారానికి ఒకసారి మాత్రమే నీటి తడి ఇవ్వాలి. విత్తనం మొలకెత్తిన తర్వాత గడ్డి నివారణ మందు పిచికారీ చేయాలి,

నువ్వు పంటతో మేలు

మా పెద్దలు నల్ల నువ్వులు పండించేవారు. ఇప్పుడవి భూముల్లో పండకుండా అయ్యాయి. అయినా తెల్లరకం నువ్వులు బాగానే వస్తున్నది. మా చేనులో మూడెకరాలు నువ్వులు సాగు చేస్తున్నా . మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉంటున్నది. అంతేకాకుండా కుటుంబం కోసం మంచి నూనెలు నాణ్యమైనవి తీసుకోవచ్చు. ఇలాంటి పంటలు ఆరోగ్యానికి, ఆర్థికంగా నిలబడడానికి ఉపయోగపడతాయి . **- జాలం అశోక్, రైతు, గుబిడి గ్రామం, భీంపూర్ మండలం**

ఈ పంటతో లాభం

మా గ్రామంలో 50 మందికి పైగా రైతులు నువ్వుల పంట వేశారు. పెన్‌గంగకు దగ్గరగా భూములు ఉండడంతో కొంత సాగునీటి సౌకర్యం ఉంటున్నది. ఇక మా చేనులో మూడు ఎకరాలు నువ్వులు వేశా. ఈ పంటకు మార్కెట్‌లో మంచి ధర ఉంది. అయితే ఈ సంవత్సరం రైతులంతా ఈ పంట సాగు చేస్తుండడంతో ధరలు తగ్గుతాయేమోనని అనుకుంటున్నాం. ఏదేమైనా ఇంటిల్లి పాదికి ,బంధువులకు మంచి రకం వంటనూనెలు, పండుగలకు ఈ నువ్వులు ఉపయోగమవుతాయి.

-రొక్కం ప్రమోద్ యువరైతు, అంతర్గాం గ్రామం, భీంపూర్ మండలం

ఈజీఎస్ పనులు 200 రోజులు కల్పించాలి

మాట్లాడుతున్న ఏఎల్‌పీకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సురేశ్

ఎదులాపురం, మార్చి 26 : ఉపాధి హామీ చట్టం పనులు 200 రోజులు కల్పించాలని అఖిల భారత ప్రగతి శీల కిసాన్ మజ్దూర్ సంఘం (ఏఎల్‌పీకేఎంఎస్) జిల్లా కార్యదర్శి కొడుప సురేశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం భవనంలో సీపీఐఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కూలీలకు న్యాయం జరిగి విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వేసవికాలంలో మెడికల్ కిట్లు, టెంట్లు ,వాటర్, పనిముట్లు కార్మికులుకు సరఫరా చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కుమ్ర జుగదిరావ్, దుర్గ బుచ్చిరాం, కుమ్ర సురేశ్, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణకే పోలీసులు

ఫ్లాగ్‌మార్చ్‌లో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

ఉట్నూర్, మార్చి 26: ప్రజల రక్షణ కోసమే పోలీస్ వ్యవస్థ ఉందని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వినాయక్‌చౌక్ నుంచి శివాజీ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ ద్వారా పట్టణంలో ప్రత్యేక బెటాలియన్‌తో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ఎల్లప్పుడు రక్షించేందుకు పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కావున పోలీసులకు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రెండ్లి పోలీస్ నడుస్తుందన్నారు. కావున ప్రజలు తమ సమస్యలు నిర్భయంగా ముందుకు వచ్చి తెలుపాలని కోరారు. ఈ కవాత్‌లో ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్ఐ మనోహర్, ప్రత్యేక బెటాలియన్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

దవాఖానల్లో సాధారణ ప్రసవాలు చేయాలి

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా , పాల్గొన్న అధికారులు

ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, మార్చి 26: ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని పీవో క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంసీహెచ్ యాక్టివిటీస్, వ్యాధి నిరోధక టీకాలు, ఏఎన్‌సీ చెకప్, ఇమ్యూనిజేషన్ వంద శాతం పూర్తి చేయాలన్నారు. అలాగే వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. దవాఖానలకు వచ్చే రోగులపై శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో ఏజెన్సీ అదనపు వైద్యాధికారి బాలు, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

దిలావర్‌పూర్, మార్చి 26 : కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని న్యూ లోలం గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రంను తహసీల్దార్ స్వాతి ప్రారంభించి చిన్నారులకు తాగునీరు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో అజీజ్ ఖాన్, మహేశ్, నాయకులున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

వీడియోకాన్ఫరెన్స్‌లో హాజరైన కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

ఎదులాపురం,మార్చి26: గ్రామాలలో, పట్టణాలలో త్రాగు నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి అధికారులను ఆదేశించారు . మంగళవారం హైదరాబాద్ నుండి వీడియోకాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వరి కోతలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళినను సరిస్తూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని, అధికారులు మాత్రమే ధాన్యం కొనగోలు కేంద్రాలను ప్రారంభోత్సం చేయాలన్నారు. ప్రతి జిల్లాలో వరికోతల ననుసరించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు షెడ్యూల్ రూపొందించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిచాల్సి ఉంటుందని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని త్రాగు నీటి సరఫరా టెంట్లు వంటి మౌలిక ఏర్పాట్లు చేయాలన్నారు. చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎక్కడ తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదనే సందేశం రైతుల వద్దకు వెళ్లేలా అవగాహన కల్పించాలని,భారత ఆహారం సంస్థ నిర్దేశించి ధాన్యం నాణ్యత ప్రమాణాలు,తేమ శాతం పై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వానాకాలం 2023-24 కుసంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని,భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖ అధికారులు ఉన్నారు.

సేంద్రియ వరి సాగు పరిశీలన

సోన్, మార్చి 26 : సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామానికి చెందిన రైతుల వరి పంట పొలాలను మంగళవారం ఏఈవో అంబాజీ పరిశీలించారు. సేంద్రియం ద్వారా సాగు చేసిన ఈ పంటల గురించి అవగాహన కల్పించారు. మొక్కకు కావాల్సిన స్థూల, సూక్ష్మ పోషక పదార్థాలు నత్రజని, భాస్వరం, పోటాష్, కాల్షియం, మెగ్నీషియం, గంధకం, ఇనుము, జింక్, రాగి మొదలగు మూలకాలను సరఫరా చేస్తుందని వివరించారు. రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచి, మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

నిర్మల్ టౌన్, మార్చి 26 : జిల్లాలోని లోకేశ్వరం మండల కేంద్రంలో గల ఎస్సీ హాస్టల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ సంఘం నాయకులు మంగళవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. కనీస సౌకర్యాలు లేవని, వార్డెన్ స్థానికంగా ఉండడం లేదని, విద్యార్థులకు దుప్పట్లు ఇవావలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు ప్రవీణ్‌కుమార్, మిథున్ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



బోథ్ ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ నాయకులు

తాంసి(తలమడుగు), మార్చి 26 : తలమడుగు మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం నేరడిగొండలో బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మండల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్‌కుమార్, కాకర్ల ప్రశాంత్, తిరుపతి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన

మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన

ఇచ్చోడ, మార్చి 26 : ఇచ్చోడలోని ఆర్టీసీ బస్టాండులో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఆధ్వర్యంలో మంగళవారం ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవికాలంలో ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు రోడ్డు భద్రత గురించి వివరించారు. అదే విధంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో కల్పిస్తున్న సేవలు వివరించారు. ఆర్టీసీ గమ్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

రూ.5కే భోజన కార్యక్రమం ప్రారంభం

భోజనం వడ్డిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 26 : వేసవికాలంలో పేదల కోసం రూ.5కే భోజనం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని శ్రీ గోపాల కృష్ణ మఠం వద్ద ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రతి రోజూ రూ.5కే భోజనం అందించే కార్యక్రమం చేపట్టారు. మంగళవారం ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే హాజరై మఠాధిపతి యోగానంద సరస్వతి, ఇస్కాన్ నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ప్రజలకు అన్నం వడ్డించారు. ఇస్కాన్ చేపడుతున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ నిర్వాహకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈత కొలను ప్రారంభం

ఆదిలాబాద్‌లోని ఈతకొలను

ఎదులాపురం, మార్చి 26 : జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలోని ఈత కొలను ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతుందని ఈత శిక్షకుడు కొమ్ము కృష్ణ తెలిపారు. మలీనమైన నీటిని తొలగించి కొత్త నీరును ఈత కొలనులో నింపామని, ఈ విషయాన్ని సాధకులు గమనించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సాధకులు తమ గుర్తింపు కార్డులను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వక్రపాదం వైద్య పరీక్షలు చేస్తున్న రిమ్స్ ఆర్థోపెడిక్ అసిస్టెంట్ సర్జన్ నాగరాజ్

ఎదులాపురం, మార్చి 26 : రిమ్స్ డైస్ కేంద్రంలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వక్రపాదం ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 0-18 సంవత్సరాల వయసు గల పిల్లలు శిబిరానికి హాజరయ్యారు. రిమ్స్ ఆర్థోపెడిక్ అసిస్టెంట్ సర్జన్ నాగరాజ్ వక్రపాదం పిల్లలకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచిత శస్త్ర చికిత్సలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. శిబిరంలో డైస్ మేనేజర్ రాధిక, డాక్టర్ రాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నిర్మల్ అర్బన్, మార్చి 26 : నిర్మల్ ఆర్టీసీ డిపో నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు ఆర్టీసీ లహరి స్లీపర్ కోచ్ సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి తెలిపారు. ముందుగా బుక్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ సదుపాయాన్ని కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలకు స్వస్తిపలికి ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకొని సురక్షింతగా గమ్యస్థానానికి చేరుకోవచ్చని తెలిపారు.